క్లుప్తంగా

కుమ్మర శాలివాహన సంఘం నూతన కార్యవర్గం



పాయకాపురం(విజయవాడరూరల్): ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం ఎన్టీఆర్ జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం కండ్రికలో జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఐలాపురం భాస్కర శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు, కార్యదర్శులుగా విలాసాగరపు రాంబాబు, బాడిశ భాస్కర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన ఏడు నియోజకవర్గాల సంఘం బాధ్యులుగా ఏడుగురుని కమిటీ సభ్యులుగా ఎనిమిది మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి శాలివాహన సంఘం పెద్దలు భర్తవరపు దుర్గాప్రసాద్ (బుల్లిబాబు), దేవగుప్తాపు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు డ్రోన్‌తో ఎమెల్ ఆయిల్ పిచికారీ



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న దోమలను నిర్మూలించేందుకు చర్యలు చేపట్టామని వీఎంసీ ప్రజారోగ్య విభాగం ప్రధాన అధికారి డాక్టర్ కె.అర్జునరావు తెలిపారు. నీరు అధికంగా నిల్వ ఉన్న ప్రాంతాలు, ప్రధాన కాల్వలు, వీఎంసీ కార్మికులు వెళ్లలేని ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు ఎంఎల్ ఆయిల్‌ను డ్రోన్ ద్వారా పిచికారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మేరకు బుధవారం వాంబే కాలనీ, రైల్వే ల్యాండ్ లో చల్లామన్నారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ కామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో వ్యాధుల నుంచి రక్ష

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రాణాంతక వ్యాధులు సోకకుండా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె బుధవారం జక్కంపూడి కాలనీలోని నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం విశిష్టతను తెలియజేశారు. ప్రతి మహిళ గర్భం దాల్చిన మూడు నెలలలోపే తప్పని సరిగా టీటీ ఇంజక్షన్ తీసుకోవాలని, రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు వాడాలని సూచించారు. అదే క్రమంలో వైద్యులను సంప్రదిస్తూ వారి సూచనల మేరకు గర్భస్థకాలంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రిలో మాత్రమే కాన్పు చేయించుకోవాలని సూచించారు. శిశువు జన్మించిన గంటలోపే బీసీజీ టీకా, పోలియో డ్రాప్స్ వేయించాలని, సంవత్సరంలోపు చేయించవలసిన అన్ని టీకాలను వేయించాలని డీఎంహెచ్‌ఓ చెప్పారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీవేత్త కోకా విమలకుమారి మృతి



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త కోకా విమలకుమారి (82) బుధవారం మృతి చెందారు. ప్రభుత్వ వ్యాయామ అధ్యాపకురాలిగా ఆమె పని చేశారు. 50 సంవత్సరాలుగా సాహితీసేవ చేస్తూ 20 పైగా పుస్తకాలను ప్రచురించారు.1988లో అప్పటి ముఖ్యమంత్రి చేతులమీదుగా ఉగాది పురస్కారం, 1995లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కవయిత్రి పురస్కారం 2000 సంవత్సరంలో ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కళాపీఠం స్థాపించి సాహిత్యరంగంలో కృషి చేసిన మహిళలకు పురస్కారాలను అందజేశారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పదవితోపాటు నగరంలోని అనేక సాంస్కృతిక కళా సంస్థల అభివృద్ధికి కృషి చేశారు. ఆచార్య సి.నారాయణరెడ్డి, సినీ నటుడు తనికెళ్ల భరణి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. నగరానికి చెందిన నవ్యాంధ్ర రచయితల సంఘం (కలిమి), ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం (చలపాక ప్రకాష్), కృష్ణా జిల్లా రచయితల సంఘం (డాక్టర్ జి.వి.పూర్ణచందు), ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ (కొల్లూరి, బోడి ఆంజనేయరాజు), వేముల హజరత్తయ్య గుప్తా, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, నృత్య కళాకారిణి కోకా విజయలక్ష్మి తదితరులు విమలకుమారి మృతికి సంతాపం తెలిపారు.

ఆక్రమణల చెరలో పార్కులు!

- వాహనాలకు పార్కింగ్ కేంద్రంగా మారిన వైనం
- అధ్వానంగా తయారైనా పట్టించుకోని అధికారులు
- అభివృద్ధి చేయాలని వినతి

పాయకాపురం(విజయవాడరూరల్): నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు ఆక్రమణలతో వ్యర్థాలను నిల్వ పెట్టుకొనే ఆవాస కేంద్రాలుగా మారాయి. పార్కులను అభివృద్ధి చేయడంలో విజయవాడ నగర పాలక సంస్థ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. 64వ డివిజన్ కుందావారి కండ్రిక జంక్షన్లో పార్కు స్వరూపాన్ని కోల్పోయి వాహనాలను పార్కు చేసుకునే ప్రాంతంగా మారింది. వ్యాపారులు కనస్ట్రక్షన్ మెటీరియల్ నిల్వ బెట్టుకునే ప్రదేశంగా తయారైంది. ఆ మార్గంలో అనేక మంది ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా పట్టీపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. ఆ పార్కులోనే నీళ్ళతోడే మోటర్లు, పొక్లెయిన్ పార్కు చేశారు. రాత్రి సమయంలో మందుబాబులు పార్కులో కూర్చొని మద్యం తాగుతున్నారు. పోలీసులు చూసినా చూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. మద్యం, గంజాయి సేవించే వారికి పార్కు ఆవాసంగా మారింది. పార్కు చుట్టూ వుండే ఐరన్ ఫెన్సింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళడంతో పార్కు ఆనవాళ్లు అక్కడ కనిపించడం లేదు. పార్కులో ఎలాంటి పూలమొక్కలు కూడా లేకపోవడంతో లారీలను పార్కు చేస్తున్నారు. ఆ ప్రాంతంలోని ప్రజలకు ఉపయోగపడేవిధంగా పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, పిల్లలకు ప్లే కిట్లు, జారుడు బల్లలను ఏర్పాటు చేయాలని జనం కోరుతున్నారు.



కండ్రికలో వ్యర్థాలతో నిండి ఉన్న పార్కు



పార్కులో మరో వైపు రోడ్డు నిర్మాణ సామగ్రి

వాకింగ్ ట్రాక్ ఉన్నా ప్రయోజనం సున్నా...

64వ డివిజన్ శానిటర్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి ఉత్తర దిక్కున ఉన్న పార్కు గత కొన్ని నెలలుగా తాళం వేసి ఉంచడంతో ప్రజలకు ఉపయోగ పడటంలేదని అంటున్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్ ఉన్నా తాళం వేసి ఉండటంతో వాకింగ్ ట్రాక్‌ను ఎవరూ ఉపయోగించుకోవడం లేదు. పార్కు తాళం తీసి ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

63వ డివిజన్ రంగా బొమ్మ సమీపంలో ఉన్న పార్కు అనేక మంది తమ సొంత వాహనాల పార్కింగ్ ప్రాంతంగా ఉపయోగించుకుంటున్నారు. స్థానికులు అనేక దఫాలు వీఎంసి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వర్షాకాలంలో వాహనాల రాకపోకలతో పార్కు గోతులు పడి వాకింగ్ చేయడానికి కూడా వీల్లేకుండా ఉంది. వీఎంసి ఉన్నతాధికారులు పార్కులను అభివృద్ధి చేసే విషయంలో శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పార్కు అభివృద్ధి చేయాలి



కండ్రిక జంక్షన్లో పార్కు ఆక్రమణలకు గురికాకముందే ప్రజలకు ఉపయోగ పడేవిధంగా అభివృద్ధి చేయాలి. పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మించి, గ్రీనరీని ఏర్పాటు చేయాలి. పిల్లలు ఆడుకునే ఆట పరికరాలను సమకూర్చాలి.

–వెంకటరమణ, కండ్రిక

దయనీయంగా మార్కులు



పార్కులను అభివృద్ధి చేయడంలో వీఎంసీ శ్రద్ధ చూపాలి. లగడపాటి కళ్యాణమండపం పక్కన ఉన్న పార్కు పేరుకే ఉంది. అందులో ఎలాంటి సదుపాయాలు లేవు. కెకె అపార్టుమెంట్ పక్కన వున్న పార్కులోనూ ఎలాంటి వసతులు లేక దయనీయంగా ఉన్నాయి.

– డి.శ్రీనివాసరావు, ప్రజాశక్తి నగర్

దోమల నిర్మూలనకు విస్తృత చర్యలు చేపట్టాలి

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలం దృష్ట్యా దోమల నిర్మూలనకు విస్తృతంగా చర్యలు చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం అజిత్ సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్, నూజివీడు రోడ్, వాంబే కాలనీ, భగత్ సింగ్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని, ఖాళీ స్థలాలలో నీటి నిల్వలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖాళీ స్థలాల్లో నీరు ఎక్కువైనప్పుడు దోమలు రాకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు తీసుకోవటంతోపాటు నిల్వ నీరు పోయేందుకు గాడి కొట్టి నీరును సహజమైన పద్ధతిలో బయటికి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు దోమల వల్ల అనారోగ్య సమస్యలు వాటిల్లకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు, కాల్వల్లో పూడికపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తీసేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు చేరుకోలేని ప్రదేశాలలో డ్రోన్ ద్వారా ఎం.ఎల్ ఆయిల్ స్ప్రే చేయాలన్నారు. భగత్ సింగ్ రోడ్ లో పారిశుద్ధ్య కార్మికుడితో మాట్లాడి, ఖాళీ స్థలాలలో వ్యర్థాలు వేసేవారికి గుర్తించాలని, అందుకు కారణాలు కూడా తెలుసుకుని వారిని చైతన్యవంతులు చేయాలని అన్నారు.



పారిశుద్ధ్య కార్మికునితో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

డాక్టర్ వరప్రసాద్‌కు ఐఆర్ఐఏ సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏషియన్ మస్క్యులో స్కెలేటల్ సొసైటీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నగరానికి చెందిన డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్‌ను బుధవారం ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్(ఐఆర్ఐఏ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

మహాత్మాగాంధీ రోడ్డులోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ మోహన్‌ప్రసాద్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ చలసాని కులదీప్, విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు బి.రాజ్ కుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ ఏషియన్ మస్క్యులో స్కెలేటల్ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ వరప్రసాద్ నియామకం దేశానికే గర్వకారణం అన్నారు. రెండున్నర దశాబ్దాల కిందట ఏర్పాటైన ఈ సొసైటీకి ఇప్పటివరకూ భారతీయులు ఎవరూ అధ్యక్షుడిగా వ్యవహరించలేదని, తొలిసారిగా తెలుగు వాడైన డాక్టర్ వీఎన్ వరప్రసాద్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించడం మనందరికీ గర్వకారణం అన్నారు. గతంలో జాతీయ స్థాయిలో ఐఆర్ఐఏ, ఐసీఆర్ఐలకు అధ్యక్షులుగా వ్యవహరించి సమర్థమైన సేవలు అందించిన డాక్టర్ వరప్రసాద్ ఇప్పుడు ఆసియా ఖండానికి సేవలు అందించే అవకాశం దక్కిందన్నారు. ఈ సందర్భంగా పలువురు రేడియాలజిస్టులు అభినందనలు తెలిపారు.



డాక్టర్ వీఎన్ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న మోహన్ ప్రసాద్, కులదీప్, రాజ్‌కుమార్ తదితరులు

ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు డిమాండ్ చేశారు. దుర్గాపురం బీఆర్టీఎస్ రోడ్డులోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే ఆటో ర్యాలీ, మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా దుర్గారావు పాల్గొని మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆటోకార్మికుల ఆదాయం స్త్రీశక్తి పథకం వల్ల మరింత దిగజారి పోయిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన నేపథ్యంలో ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని, వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.25 వేల సాయం చేయాలని కోరారు. ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అనేక మంది, వ్యవసాయం లాభసాటి లేక యువత ప్రైవేట్ ఫైనాన్సర్లు, బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుని ఆటోలు కొనుగోలు చేసి ప్రతినెలా కిస్తీలు చెల్లిస్తూ స్వయం ఉపాధితో కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు పది లక్షల మంది ఆటో డ్రైవర్లు స్వయం ఉపాధి పొందుతున్నారని, స్త్రీశక్తి పథకం వల్ల ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిందని పేర్కొన్నారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే దశల వారి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు బి.రూబెన్ కుమార్ ఎం.హనుమంతరావు, ఎస్‌డీ కరిముల్లా ఎస్‌కే దుర్గావలి, డి.కోటయ్య ఎం.సోమేశ్వరరావు జి.శ్రీనివాసరావు ఎ.వి.రెడ్డి, డి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దుర్గారావు తదితరులు

ఆదాయపు పన్ను చట్టాలపై అవగాహన తప్పనిసరి

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఆదాయపు పన్ను చెల్లింపులో ప్రభుత్వం కల్పించిన మినహాయింపుల గురించి చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ)లకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని ఆదాయపు పన్ను శాఖ విజయవాడ సర్కిల్ (మినహాయింపుల విభాగం) డెప్యూటీ కమిషనర్ టి.సూరజ్‌రావు సాహెబ్ అన్నారు. ఆదాయపు పన్ను శాఖ మినహాయింపు విభాగంలో తాజాగా చేసిన సవరణలపై అవగాహన సదస్సు బుధవారం ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) భవన్‌లో జరిగింది. సూరజ్‌రావు సాహెబ్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను శాఖ పన్ను చెల్లింపులో కొన్ని సంస్థలకు మినహాయింపులు ఇస్తోందని, ఆ మినహాయింపుల్లో ప్రభుత్వం తాజాగా కొన్ని సవరణలు చేసిందన్నారు. ఆ సవరణల గురించి పూర్తి వివరాలు సీఏలు తెలుసుకోవాలన్నారు. ఆదాయపు పన్ను ప్రాముఖ్యత, రిటర్న్ దాఖలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రస్టుల ద్వారా రిటర్న్ దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనల గురించి ఆయన సీఏలకు అవగాహన కల్పించారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ గుంటూరు సర్కిల్ మినహాయింపుల విభాగం అధికారి జి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సదస్సు అనంతరం సీఏలు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ చైర్మన్ కంచమరెడ్డి నారాయణ, ఐసీఏఐ విజయవాడ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జయంత్, కార్యదర్శి మనీష్‌కుమార్ జైన్, కోశాధికారి వి.వీరపవన్‌కుమార్, పలువురు సీఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూరజ్ రావు సాహెబ్

ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

- అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు
- ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు హెచ్చరిక
- ఈ తనిఖీలలో మూడు కేసులు నమోదు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని పలు ఎరువుల దుకాణాలపై పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందులకు అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు, డీసీపీల పర్యవేక్షణలో ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో జిల్లాలోని ఎరువుల దుకాణాలు, ఎరువుల గోడౌన్లు, బోర్డర్ చెక్ పోస్టుల వద్ద పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్టాక్ నమోదు, పీఓఎస్ యంత్రాల్లో నమోదైన వివరాలు, పంపిణీ రిజిస్టర్లు, విక్రయ పత్రాలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. జిల్లాలో యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి, అవి బ్లాక్ మార్కెట్‌కి వెళ్లకుండా అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. జిల్లాలో యూరియా అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు సీపీ రాజశేఖరబాబు తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా ఎ.కొండూరు, గంపలగూడెం తిరువూరు పోలీస్ స్టేషన్ పరిధిలలోని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై మూడు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమ నిల్వలు చేస్తే సహించేది లేదని సీపీ రాజశేఖరబాబు హెచ్చరించారు.

విఘ్నేశ్వరుని దీవెనలు ప్రజలపై ఉండాలి



వినాయకుని విగ్రహానికి పూజ చేస్తున్న మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శైలజ



రాజీవ్‌నగర్లో వినాయకునికి పూజ



వినాయకునికి కరెన్సీతో అలంకారం

పాయకాపురం(విజయవాడరూరల్): వినాయకుని చల్లని దీవెనలు నియోజకవర్గంలోని ప్రజలందరిపై ఉండాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. ప్రజాశక్తి నగర్లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన పూజాలో మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జేపీ నాయుడు, డివిజన్ పార్టీ కన్వీనర్ ఎస్‌కే ఇస్మాయిల్, శేఖర్, బాషా, నున్న గ్రామ మాజీ సర్పంచ్ కె.విజయ్‌కుమార్, సతీష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్‌లో మెగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులు ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి, కాసిం వలి, శ్రీను,దస్తగిరి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలో శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో బుధవారం వినాయకునికి కరెన్సీ నోట్లతో అలంకారం చేసి పూజలు చేశారు. శాంతి హోమం నిర్వహించిన తర్వాత సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.రవికుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మధురానగర్ నేతాజీ కాలనీలో బుధవారం సాయంత్రం చాంద్ ఈవెంట్స్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సంగీత్ ఉర్రూతలూగించింది. సినీ, భక్తి గీతాలకు అనుగుణంగా చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సంగీత్‌లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. సంగీత్‌ను ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నాయకుడు చాంద్‌ను నిర్వాహకులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. తొలుత ఎన్‌టీజీ యూత్ ఆధ్వర్యాన వినాయకునికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. 28వ డివిజన్ సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో నిర్వహించిన గంగాధర్ మ్యాజిక్ షో ప్రేక్షకులను అలరించింది. పెద్ద సంఖ్యలో భక్తులు మ్యాజిక్ షోను ఆసక్తిగా తిలకించారు. గురువారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు గుడిపాటి దత్తు తెలిపారు. అలాగే సాయంత్రం వినాయకుని లడ్డూకి వచ్చిన నగదును భారత సైన్యంలో పనిచేసిన ఒక సైనికుడి కుటుంబానికి అందజేయనున్నట్లు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాల స్వీకరించాలని కోరారు.



అన్నదానం చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు



నేతాజీ కాలనీలో నిర్వహించిన సంగీత్‌లో నిర్వాహకులు

వైద్య విద్యార్థుల పరిశోధనలకు మృతదేహం అప్పగింత



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన జి.వరప్రసాదరావు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ మేరకు మృతుని సోదరుడు అశోక్‌కుమార్ అంగీకార పత్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్ప స్వామివారి మందిరంలో బుధవారం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు అర్చనలు, పంచామృత అభిషేకం జరిగింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావటంతో భక్తులు స్వయంగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. గురుస్వామి బల్లెం పూర్ణయ్యస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అయ్యప్పస్వామి భజన జరిగింది.

ఆలయ అభివృద్ధికి రూ. 50వేలు విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ రామకృష్ణాపురం శ్రీఅలమేలు మంగ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం అభివృద్ధి పనులకుగానూ బుధవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రూ. 50వేలు విరాళంను స్థానిక నాయకులతో పంపించారు. ఆలయం అభివృద్ధి జరిగేందుకు గానూ నగదు అందించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ ఎస్ఐ కుమార్



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో ఫుట్‌పాత్‌లు, పాదచారులు సురక్షితంగా రాకపోకలకు సాగించేందుకు ఏర్పాటు చేసినవని, వాటిపై ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మూడవ ట్రాఫిక్ ఎస్ఐ జి.వి.ఎన్ కుమార్ హెచ్చరించారు. సత్యనారాయణపురం, బీఆర్టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుమార్ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కారణంగా పాదచారులు రోడ్డుమీద వాహనాల మధ్య రాకపోకలు సాగించే సమయంలో అనేక ప్రమాదాల భారిన పడుతున్నాట్లు తెలిపారు. ముఖ్యంగా బీఆర్టీఎస్ రోడ్డు సీతన్నపేట గేటు నుంచి శారద కళాశాల జంక్షన్ వరకు రోడ్డుకు రెండు వైపుల ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను కొంతమంది వ్యాపారులు ఆక్రమించి బడ్డీకొట్లు, పూల కొట్లు, కార్ సర్వీసింగ్ పాయింట్‌లు, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసుకున్నారు. ఫుట్‌పాత్‌లను ఉపయోగించుకోవడం పాదచారుల హక్కు అని తెలిపారు. వాటిని ఉల్లంఘించి ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేదిలేదని తెలిపారు.